

17న ఉమ్మడి జిల్లాలో సిఎం పర్యటన

- కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 17న ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఉన్న సందర్భంగా కర్నూలు ఎయిర్పోర్ట్‌లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లా పర్యటన ఏర్పాట్ల అంశంపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి ఉదయం 11 గంటలకు కర్నూలు ఎయిర్పోర్ట్‌కు చేరుకుంటా రన్నారు. అనంతరం అక్కడ నుండి నంద్యాల జిల్లా మల్యాలవద్ద హెచ్ఎన్ఎస్ఎస్ నుండి నీటిని విడుదల చేసిన తర్వాత పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం కర్నూలు ఎయిర్‌పోర్టుకు వచ్చి విజయవాడ విమానాశ్రయానికి వెళ్తారన్నారు.. ఈ మేరకు తాత్కాలిక పర్యటన వివరాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఎయిర్‌పోర్టులో సేఫ్‌రూమ్, మెడికల్ టీమ్ లను, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఇంచార్జి డిఎంహెచ్ఒను. జిజిహెచ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఫైర్‌కు సంబంధించిన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. పోలీస్ శాఖతో కోఆర్డినేట్ చేసుకొని కాన్వాయ్ ఏర్పాట్లు చూసుకోవాలని కలెక్టర్ డిటిసిని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పి హుస్సేన్‌పీరా, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఇంచార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ రాజు , డిటిసి శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

చినుకు జాడ లేదు...

- 45 రోజుల్లో పైర్లను కాపాడే వర్షం లేదు - ఆందోళనలో అన్నదాత

ప్రజాశక్తి-పత్తికొండ

మే నెలలో జోరుగా వర్షాలు కురవడంతో రైతులు పంట పొలాలను దుక్కి దున్ని సాగు సన్నద్ధం అయ్యారు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురవడంతో పత్తి, టమోటా, వేరుశనగ, కంది ,ఆముదం, కొర్ర, సజ్జ ఉల్లి తదితర పంటలను రైతు సాగు చేశారు. గడిచిన 45 రోజులలో చినుకు జాడ లేకపోవడంతో వేసిన పంటలు ఎండిపోవడంతో రైతుల కన్నీరు మున్నీరు అవుతున్నారు. డివిజన్ కేంద్రమైన పత్తికొండలో రోజురోజుకు ఎండ తీవ్రత పెరిగిపోవడంతో వేసిన పంటలు వేడికి బుగ్గిపాలవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో పత్తికొండ మండల పరిధిలోని హోసూరు, పుచ్చకాయలమాడ,



చిన్నహుల్తి, పెద్దహుల్తి, దేవనబండ, మండగిరి, జూటూరు, చందోలి, చక్రాల కొత్తపల్లి ,పందికోన గ్రామాలలో పత్తి ,కంది, మిరప, ఉల్లి ,టమోటా, సజ్జ, ఆముదం, కొర్ర పంటలను 12, 860 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారు. ఈ సంవత్సరం 11, 000 హెక్టార్లలో పంటలు సాగు చేశారని వ్యవసాయ అధికారులు వివరాలను వెల్లడించారు. ఒక ఎకరా పంట సాగు చేయడానికి రూ.20 నుండి రూ.30 వేల పెట్టుబడి పెట్టామని రైతులు చెప్పారు. మరో 10 రోజుల్లో వర్షం కురవకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు పంట పొలాల్లో సందర్శించి సూచనలు సలహాలు ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఉల్లి ,కంది, పత్తి సాగు చేశాను...

- యువరైతు బనగాని సురేంద్ర, హోసూరు గ్రామం పత్తికొండ మండలం



తొలకరి వర్షాలు జోరుగా కురవడంతో ఆరు ఎకరాలలో ఉల్లి, కంది, టమోటా, పంటను సాగు చేశాను. సుమారు రూ.70 వేల పైగా పెట్టుబడి పెట్టాను. రోజురోజుకు ఎండ తీవ్రతతో పంటలు ఎండిపోతున్నాయి.

వర్షం కోసం ఎదురుచూపు

- కౌలురైతు... దేశాయి లక్ష్మన్న నలకదొడ్డి గ్రామం, పత్తికొండ మండలం



జూన్ మొదటి వారంలో పత్తి, టమోటా పంటను సాగు చేశాను. నాటిన రోజు నుండి ఇప్పటివరకు వర్షం పడలేదు. రోజురోజుకు ఎండ, ఈదుర గాలులతో మొలకెత్తిన పంటలు ఎండిపోతున్నాయి.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- మండల వ్యవసాధికారి వెంకట రాముడు



పంట సాగు చేసిన 30 నుండి 45 రోజుల్లో ఒక ఎకరానికి రెండు కేజీల యూరియా ,19:19:19, మ్యాక్స్‌ను పిచికారి చేయాలి. నీటి ఎద్దడి రాకుండా సూచనలు, సలహాలు పాటించాలి.

వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



నగరంలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వెంకటరమణ కాలనీ, బిర్లా కాంపౌండ్, సి.క్యాంపు ప్రాంతాల్లో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. పాతనగరం చిదంబరావు వీధిలో శిథిలావస్థకు చేరిన అమీర్‌మియ్య భవనాన్ని పరిశీలించారు. అంతకుముందు శ్రీరామ్‌నగర్, దేవనగర్, గాయత్రీ ఎస్టేట్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.కమిషనర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తద్వారా రహదారులపై ట్రాఫిక్ ఏర్పడకుండా, వీధి వ్యాపారులు వెండింగ్ జోన్లలో వ్యాపారం చేసుకోవచ్చని చెప్పారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, బిల్డింగ్ సూపర్వైజర్ అంజాద్‌బాష, పారిశుధ్య తనిఖీదారుడు అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్జరీని పరిచయం చేసిన సుశ్రుతుడు

- కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రపంచానికి సర్జరీని పరిచయం చేసింది మన దేశ ప్రాచీన వైద్యుడు సుశ్రుతుడని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. మంగళవారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం జులై 15 సందర్భంగా మెడికల్ కాలేజీ ఆవరణంలోని సుశ్రుతుడు విగ్రహానికి హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్లతో కలిసి పూలమల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తుపూర్వం 600 సంవత్సరాల క్రితమే సింధూ నాగరికత ప్రాంతంలో సర్జరీలు సుశ్రుతుడు చేశాడని అప్పట్లోనే ప్లాస్టిక్ సర్జరీలు సైతం చేశాడని తెలిపారు. పాస్టిక్ సర్జరీ హెచ్ఒడి డాక్టర్ మంజులబాయి మాట్లాడుతూ ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం తొలిసారి అసోసియేషన్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ప్రభుత్వాన్ని కొరగా జులై 15 ని అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయంలో ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డే జులై 15 ని ప్రకటించిందని చెప్పారు. అప్పటి నుండే ప్రపంచ దేశాలన్ని కూడా 15న పాటిస్తున్నాయని తెలిపారు. తల వెంట్రుకల ప్రాంతం నుంచి అరికాలు వరకు ప్లాస్టిక్ సర్జరీ విభాగం సేవలందిస్తోందని అన్నారు. వైష్ణవి నర్సింగ్ హోమ్ సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ భానుమూర్తి సీనియర్ ప్రొఫెసర్ ప్లాస్టిక్ సర్జరీ విభాగపు లైబ్రరీ పుస్తకాల కొరకు రూ.25 వేల డొనేషన్, తన దగ్గర ఉన్న విలువైన పుస్తకాలను కూడా లైబ్రరీకి ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జరీ వార్డులో రోగులకు స్నాక్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరిచరణ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా రవి కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయ్ చంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



సుశ్రుతుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ చిట్టినరసమ్మ , వైద్యాధికారులు

డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలి

- కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో వెంటనే డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని నిరసన కార్యక్రమం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదలై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించలేకపోవడం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే యువగలం పాదయాత్రలో గత వైసిపి ప్రభుత్వం డిగ్రీ ఆన్‌లైన్ విధానం ద్వారా లక్షలాది మంది విద్యార్థులు తమకు ఇష్టమైన డిగ్రీ కళాశాలలో చేరలేకపోయారని, మేజర్ మైనర్ విధానం ద్వారా చాలామంది విద్యార్థులు తమకు ఇంట్రెస్ట్ ఉన్న గ్రూపును ఎంచుకోలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆన్‌లైన్ విధానాన్ని రద్దుచేసి మేజర్ మైనర్ విధానాన్ని కూడా రద్దు చేస్తామని చెప్పిందన్నారు. ఈ విద్యాశాఖ మంత్రి జులై నెల వచ్చినా కూడా డిగ్రీకి సంబంధించి ఒక స్పష్టమైన హామీ ఇవ్వకుండా డబుల్ మేజర్ విధానాన్ని డిగ్రీలో అమలు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని దానిపైన ఒక కమిటీ ఏర్పాటు చేసి మూడు నెలల లోపల నివేదిక ఇవ్వాలని చెప్పి నివేదిక వచ్చిన తర్వాత ఎలాంటి సర్కులర్ రిలీజ్ చేయలేదన్నారు. మరల సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగిస్తున్నామని చెప్పడం వెనుక దాగి ఉన్న రహస్యం ఏంటో తెలపాలన్నారు. ఇలా మాట మారుస్తూ విద్యార్థుల జీవితాలతో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి కోన శశిధర్ , రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెలగాటమాడుతున్నారని అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో ప్రారంభించాలని, డబుల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని, గ్రూప్‌కు తగ్గ ఇంట్రెస్ట్ విధానాన్ని కొనసాగించాలని, మేజర్ సబ్జెక్టులా మైనర్ సబ్జెక్టులు కూడా క్రెడిట్లు పెంచాలని వారి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరిని కలుపుకొని చలో విజయవాడకు పిలుపునిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు అబూబకర్, సాయిఉదయ్, జిల్లా సహాయ కార్యదర్శి అమర్, జిల్లా నాయకులు రామకృష్ణ, మల్లేష్ నగర వృద్వి యోగి రాముడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక దృష్టి

-ట్రయల్ రన్ ను పరిశీలించిన ట్రాఫిక్ సిఐ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం డ్రోన్ కెమెరాలను వినియోగిస్తు న్నట్లు కర్నూలు ట్రాఫిక్ సిఐ మనుషురుద్దీన్ తెలిపారు. కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ డ్రోన్ కెమెరాతో ట్రయల్ రన్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..నిబంధనలు పాటించని వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లను గుర్తిస్తామన్నారు.ప్రధాన సర్కిళ్లతోపాటు ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంత్రాలలో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తా మన్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, వివిధ కాలనీల్లోని వాహనాల రాక పోకలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పై ప్రధాన దృష్టి సారిస్తున్నా మన్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా డ్రోన్ల ద్వారా పరిశీలించి తగు చర్యలు తీసు కుంటామన్నారు. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఇరుకు రోడ్లలలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలన చేసి సమీక్షించారు. మైనర్ డ్రైవింగ్‌ను నియంత్రించ డానికి కూడా నిఘా పట్టిష్టం చేశామన్నారు. రాజ్ విహార్ సెంటర్, బుధవార పేట, సి .క్యాంప్, గాయత్రి ఎస్టేట్స్, బళ్లారి చౌరస్తా , ఇతర ముఖ్యమైన జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీని తొలగించడానికి డ్రోన్ కెమెరాతో ట్రయల్ రన్ నిర్వహించారు.

అనుభవం లేదని ఆగిన ఆపరేషన్లు

-కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఎదురు చూపులు

-గడియారం ఆస్పత్రిలో వైద్యుల కొరత తీరేనా?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ఎంతో పేరు ప్రఖ్యాతలుగాంచిన గడియారం హాస్పిటల్‌లో ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ థియేటర్లో కుటుంబ నియంత్రణ కోసం జనాలు నిరీక్షిస్తున్నారని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్,నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్, అబ్దుల్ దేశాయ్ లు పత్రికా ప్రకటనలోతెలిపారు. గడియారం హాస్పిటల్‌లో గతంలో ఉన్నఫ్యామిలీ ప్లానింగ్ డాక్టర్‌ను ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆయన స్థానంలో కొత్తగా వచ్చిన మరో డాక్టర్ ట్రైనింగ్ లేదనే నెపంతో ఆపరేషన్లు చేయడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందుల గురవుతున్నారని తెలిపారు. ఇటువంటి ఆపరేషన్ ట్రైనింగ్ లేని వారికి ఇక్కడికి ఎలా ట్రాన్స్ఫర్ చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలల నుండి ఈ ఆస్పత్రికి వచ్చి ఆపరేషన్లు చేసుకొనే వారని, ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను పొందే వారిని, రాయితీని కూడా పొందే వారిని ఇప్పుడూ వచ్చిన డాక్టరు ట్రైనింగ్ లేదని డిఎంఅండ్‌హెచ్ఒకు లెటర్ కూడా పెట్టినట్లు డాక్టర్ తెలిపారని వారు వివరించారు. అనుభవం లేదని ఆపరేషన్ చేయక పోవడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. తక్షణమే పై అధికారుల స్పందించి కుటుంబ నియంత్రణ చేయడానికి కావలసిన సహాయ సహకారాలు అందించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

క్రీడా రాజధానిగా ఎదుగుతున్న కర్నూలు

జిల్లాస్థాయి ఆట్య పాట్య ఎంపిక పోటీలలో డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతి రాజధాని అయితే కర్నూలు నగరం మాత్రం క్రీడలకు రాజధానిగా ఎదుగుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి ఆట్య పాట్య ఎంపిక పోటీలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూలు నగరంలో క్రీడలకు ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీలలో క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. ఈ పోటీలలో జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని, ఆ పోటీల్లో కర్నూలు జట్టు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ దేహదారుఢ్యం పెరుగుతుందని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక బలం పెరగడంతో పాటు బ్రీతింగ్ అధికంగా తీసుకోవడం వల్ల మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుందని వివరించారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించాలంటే ముఖ్యంగా పోషక ఆహారం తీసుకోవాలని, బి కాంప్లెక్స్ టాబ్లెట్లు, పండ్లు ,ఆకుకూరలు తినడం వల్ల క్యాన్సర్ లాంటి జబ్బులు రాకుండా ఉంటాయని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు.ఈ పోటీలలో బాలుర విభాగంలో మొదటి స్థానంలో పెండేకంటి ఇంగ్లీష్ మీడియం స్కూల్, రెండవ స్థానంలో ఓర్వకల్లు ఎపిమోడల్ స్కూల్,మూడవ స్థానంలో కేశవరెడ్డి స్కూల్ నిలువగా, బాలికల విభాగంలో ఓర్వకల్లు కస్తూర్బా గాంధీ విద్యాలయం, రెండవ స్థానంలో మంత్రాలయం కస్తూర్బా గాంధీ విద్యాలయం ,మూడవ స్థానంలో తుగ్గలి కస్తూర్బా గాంధీ విద్యాలయం నిలిచాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఆట్య పాట్యసంఘం కార్యదర్శి నాగరత్నమయ్య, చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారినికి జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

సుపరి పాలన అందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సి బెళగల్


ప్రజలకు సు పరి పాలన అందించడమే టిడిపి ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల. దస్తగిరి పేర్కొన్నారు. మంగళ వారం సింగవరం, ఈర్లదిన్న, ముడుమాల గ్రామాల్లో నాయకులు వెంకట్రామి రెడ్డి, రాఘవరెడ్డి, పౌలు, భాస్కర్ల సమక్షంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇక్కడే మహిళలతో, విద్యార్థులతో ముచ్చటించి మాట్లాడారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముడుమాల లో తాగునీటి కలుషితం ఉందని, దీంతో ప్రజలు అనారోగ్యం కాకుండా ఏకంగా ప్రాణాలు పోగొట్టుకొన్నారని ప్రజలు ఎమ్మెల్యేతో వాపోయారు. నదిలో ఇసుక రీచ్ తోడే పడవల గుండా వచ్చే ఇందన కాలుష్యంతో కలుషితమై సరఫరా అయ్యే నీటిని తాగడం వలన విష జ్వరాల బారిన పడ్డారని అన్నారు. ఈర్లదిన్నే లో మునగాలకు వెళ్ళుటకు రోడ్డు సౌకర్యంగా లేదని , సింగవరంలో సాగునీటి పథకం మరుగున పడిందని బాగు చేయాలని రాఘవ రెడ్డి, వెంకట్రామి రెడ్డి తెలిపారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కన్వీనర్ చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ చిన్న తిమ్మప్ప, కొత్తకోట హరి, పోలకల్ అమర్నాథ్,తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజల సంక్షేమమే లక్ష్యం : కెఇ శ్యాంకుమార్

క్రిష్ణగిరి : గ్రామాలలో దశాబ్దాల పాటు పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించడమే టిడిపి లక్ష్యమని ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్ అన్నారు. మంగళవారం పోతుగల్లు, మల్లాపురం గ్రామాలలో జరిగిన సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ హాజరయ్యారు. పత్తికొండ మార్కెట్ యాడ్ చైర్మన్ ఆలంకొండ షేక్ నబీ సాహెబ్, కర్నూలు జిల్లా టిడిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్వి ప్రసాద్, గురుస్వామి, రఫీ,సంబంధిత గ్రామాల టిడిపి నాయకులు సోమలింగ గౌడ్,శివ ఎం.శ్రీరాములు,బ్రహ్మయ్య,మల్లేష్,పుల్లన్న గౌడ్,బి వెంకట రాముడు వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకష్ణాపురం దామోదర్ నాయుడు, కోయిలకొండ సహకార సొసైటీ చైర్మన్ చిట్యాల నక్క నాగరాజు కంబలపాడు రమేష్ , కోయిలకొండ సర్పంచి లక్ష్మిఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్

కేంద్రం నుంచి వస్తే కందిపప్పు పునరుద్ధరణ

- ప్రజాశక్తి కథనానికి పౌర సరఫరాల సంస్థ వివరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం నుంచి కందులు వచ్చిన వెంటనే కందిపప్పు సరఫరా పునరుద్ధరిస్తామని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎస్.వెంకటరాముడు తెలిపారు. ప్రజాశక్తితో మంగళవారం ప్రచురితమైన 'ఈ సారీ కందిపప్పు లేదు' అనే కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కందులు కేటాయించడం లేదని, అందు వల్ల రేషన్‌లో కందిపప్పు పంపిణీ చేయలేకపోతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కందుల కేటాయింపులు వచ్చిన వెంటనే ఆ కందులను ఆడించి కందిపప్పు సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఐఎన్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథను మంగళవారం ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న ఇతర నాయకులు కలిసి సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షుడు ఆర్.ప్రతాప్, మున్సిపాల్ ఎంప్లాయిస్ తరపున ఆర్.సురేష్ తదితర కార్మికులు కలిశారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

విద్యుత్ ఎఇకి సిపిఎం వినతి

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్


స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కల్లూరు మండలం విద్యుత్ ఎఇ సి వెంకటేశ్వర్లుకు మండల కార్యదర్శి కృష్ణ నాయకత్వంలో వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ ప్రజల ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టడాన్ని ఉప సంహరించుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల కంటే ముందు జగన్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే పగలగొట్టండని చెప్పిందని, మరి ఇప్పుడు కూటమి ప్రభుత్వం దగ్గర ఉండి స్మాట్ మీటర్లు బిగిస్తుందన్నారు. అలాంటప్పుడు ఎన్నికల ముందు ప్రజలకు ఎందుకు మోసపు మాటలు చెప్పారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షాన విద్యుత్ ఉద్యమం చేయబడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎ.కృష్ణ, మండల నాయకులు కె మధు, పందిపాడు శీను, పెద్దపాడు గోపి, యేసు రాజు పాల్గొన్నారు.



విద్యుత్ ఎఇకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ కోతలు అరికట్టాలి

- సచివాలయ అధికారులకు సిపిఎం వినతి



వినతి పత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో శివారు ప్రాంతంలో విద్యుత్ కోతలు ఆపాలని, నాణ్యమైన విద్యుత్ అందించాలని సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు కె.కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో శివారు ప్రాంతంలో పేదలకు కరెంటు కోతలు గంట గంటకు కోతలు అధికమయ్యాయని కాబట్టి విద్యుత్ అధికారులు తక్షణమే కోతలు లేకుండా ప్రజలకు విద్యుత్ అందించాలని సిపిఎం ఆధ్వర్యంలో శివన్న నగర్ ఎన్టీఆర్ కాలనీ సచివాలయ అడ్మిన్ అధికారులకు సిపిఎం వినతి పత్రం సమర్పించారు. సిపిఎం పట్టణ నాయకులు బి రాముడు, కె కృష్ణ మాట్లాడుతూ చేనేత పురి ప్రసిద్ధిగాంచిన పట్టణంలో కూటమి ప్రభుత్వం శివారు ప్రాంతం ప్రజలకు చేనేత కార్మికులకు కోతలు లేకుండా కరెంటు సప్లై చేయాలని కోరారు. కరెంటు ఖాతాదారులు బిల్లు చెల్లించడంలో ప్రథమ స్థానంలో ఉన్న ప్రజలకు పగలనక రాత్రి అనక కరెంటు కోతలు అధికమయ్యాయని తెలిపారు. కరెంటు బిల్లు వసూలు చేయడంలో శ్రద్ధ వహిస్తున్న అధికారులు విద్యుత్తు అందించడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని, అలాగే 20 ఏళ్ల నుండి ఉన్న విద్యుత్ లైన్లను మార్చకుండా మరమ్మతులు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి సమాచారం లేకుండా కోతలు విధిస్తే ప్రజలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు మోహన్, షేక్షావలి రంగన్న, బాబు పాల్గొన్నారు.

హోరాహోరీగా మార్కెట్ వేలం

- రూ.14.60 లక్షలకు దక్కించుకున్న చోళ వెంకట రాముడు



వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం కూరగా యల మార్కెట్ వేలం పాట హోరాహోరీగా సాగింది. సర్పంచి వెంకటేష్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో ఐదుగురు పాట దారులు పాల్గొనగా చోళ వెంకటరాముడు రూ.14.60 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి నబీ, డిఎల్‌పిఒ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ ఇంద్రాణి మాట్లాడారు. పంచాయతీ తీర్మానం మేరకు గ్రామంలో ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం వేలం పాటలో వచ్చిన సగం నగదు కేటాయిస్తున్నామని తెలిపారు. మిగిలిన నగదు పంచాయతీకి జమ చేస్తామన్నారు. గతంలో కంటే ఈ ఏడాది పంచాయతీకి రూ.2.30 లక్షలు అదనంగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు. పంచాయతీ నిబంధనల మేరకే వేలం పాటను దక్కించుకున్న కాంట్రాక్టర్ నడుచుకోవాలన్నారు. గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, శ్వేత వాహన్ రెడ్డి, శేషాద్రి నాయుడు, చిన్న రెడ్డి, నారాయణ, వెంకటేష్, భీమన్న, నాగన్న, సోమన్న, శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో హమాలీ సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి -ఆలూరు

హాలహర్వి మండలం సిద్ధాపురంలో సిఐటియు అనుబంధంగా ఎపి హమాలీ సంఘం 20మంది కార్మికులతో ఏర్పాటు చేశారు. మంగళవారం సిఐటియు మండల నాయకులు కృష్ణ అధ్యక్షతన గ్రామంలో డప్పులు, బాణసంచాలతో ఊరేగింపుగా సభ ప్రాంగణం వరకు వెళ్లారు. హమాలీ సంఘం (సిఐటియు) జెండాను సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, కెపి.నారాయణ స్వామి, గ్రామ పెద్దలు శంకరనంద, బసవరాజు, చంద్రగౌడ్ హాజరయి మాట్లాడారు. హమాలీలు, రైతులు, వ్యాపారులు మాట్లాడుకొని ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఇతర గ్రామాల్లో ఉన్న రేటు ప్రకారం తీసుకొని అందరి సహకారాలు పొందాలని తెలిపారు. సిఐటియు నాయకులు షాకీర్, రంజాన్, హమాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, సిద్ధప్ప, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

యూరియా కోసం పడిగాపులు..!

ప్రజాశక్తి - కౌతాళం

పంటలు బాగా పండాలంటే ఎరువులు ఎంతో అవసరం.. ఎరువులు అందకుంటే.. ఎంత ఆందోళన చెందుతారో ఆ రైతులకు తెలుస్తుంది.. ప్రధానంగా రైతులకు యూరియా అందుబాటులో లేకపోవడంతో కొన్ని రోజుల నుంచి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకున్న వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించడంతో మండలంలోని రైతులు కౌతాళంలోని రైతు భరోసా కేంద్రానికి మంగళవారం ఉదయం నుంచి యూరియా కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. 'అప్పుడిస్తారు.. ఇప్పుడిస్తార'ని సాయంత్రం వరకు రైతు భరోసా కేంద్రం వద్ద పడిగాపులు కాస్తూ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతు సేవా కేంద్రం వద్ద గందరగోళం

మండల వ్యవసాయ అధికారులు యూరియా పంపిణీ కోసం టోకెన్లు పంపిణీ చేశారు. రైతు పట్టా పాస్ బుక్ 5 బస్తాల ప్రకారం టోకెన్ ఇచ్చారు. వ్యవసాయ అధికారులు 2 వేల బస్తాలకు ఇండెంట్ ఇచ్చారు. మంగళవారం సాయంత్రమైనా యూరియా రాకపోవడంతో గందరగోళం నెలకొంది. పోలీసుల సహకారం తీసుకొని రైతుల ఆందోళన పరిస్థితిని నియంత్రించారు. కేవలం రెండు లోడ్లు (600 బస్తాల యూరియా) రావడంతో యూరియా పంపిణీ ప్రారంభించారు. చీకటి పడినా ఎఒ శేషాద్రి తన సిబ్బందితో అక్కడున్న రైతులకు యూరియాను పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు బుధవారం యూరియాను అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.



పడిగాపులు కాస్తున్న రైతులు

యూరియా పడిగాపులు

యూరియా కోసం ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నామని మండలంలోని మురళ గ్రామానికి చెందిన రైతు తిమ్మప్ప పేర్కొన్నారు. అధికారులు యూరియా ఇస్తామని చెప్పడంతో ఉదయమే కేంద్రానికి వచ్చామని తెలిపారు. యూరియా బస్తాల కోసం గ్రామాల నుంచి వాహనాలు తీసుకొచ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు.



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చిప్పగిరి

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని అధికారులు పరిశీలించారు. ప్రజాశక్తి పత్రికలో ఈనెల 12న 'శిథిలావస్థలో బ్రిడ్జి' కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఇరిగేషన్ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, డిఇ చంద్రశేఖర్, శ్రీధర్, జెఇలు వచ్చి బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ మాట్లాడారు. బ్రిడ్జి పూర్తిగా దెబ్బతినిందని, వెంటనే జిల్లా కలెక్టర్, ఇన్‌ఛార్జ్ మంత్రి రామానాయుడుకు సమాచారం చేరవేసి వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎటిసి కాలువకు సాగునీరు వచ్చే లోపు బ్రిడ్జి మరమ్మతులు వేగవంతం చేస్తామని చెప్పారు. ఎటిసి కాలువకు రూ.1.76 కోట్లతో చేపట్టిన పూడికతీత, కంపచెట్ల తొలగింపు పనులు తుది దశకు చేరుకుందని తెలిపారు.

నదీతీరంలో పారిశుధ్య పనులు

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య



పనులను పరిశీలిస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో తుంగభద్ర నదీతీరంలో పారిశుధ్య పనులు చేసేందుకు కలిసి రావాలని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య గ్రామస్తులను కోరారు. మంగళవారం తుంగభద్ర నది వద్దన పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల తుంగభద్ర నదికి హోస్పేట్ డ్యాం నుంచి భారీ స్థాయిలో నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, పారిశుధ్య కార్మికులతో కలిసి నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం, ముళ్ల కంపలు, భక్తులు వదలిన బట్టలను బురద నుంచి వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక మీద ప్రతి ఏకాదశి రోజున గ్రామస్తులతో కలిసి పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ఆదేశాలతో తుంగభద్ర నది పరిశుభ్రత పనులు మొదలు పెట్టామని చెప్పారు.

శ్రీమఠంలో అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో కొనసాగుతున్న నిత్యాన్నదానానికి కాలిఫోర్నియాకు చెందిన శంకర్ రాధాకృష్ణన్ అనే భక్తుడు అన్నదాన సేవ కోసం రూ.1,08,600 విరాళం ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన ఆయన గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు.

ఎరువుల దుకాణాలపై

విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-ఆదోని రూరల్

పట్టణంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కే.ఐ.సుదర్శన రాజు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ వెంకట ప్రసాద్, ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.బాలవర్ధిరాజు, మండల వ్యవసాయ అధికారి బివిజి సుధాకర్ ఆదోనిలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. శ్రీ లక్ష్మీ గణేష్ ఎంటర్ప్రైజెస్‌కు రూ.11,34,474, శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌కు రూ.18,71,125, భువనేశ్వరి సీడ్స్‌కు రూ.1,76,300, మొత్తం రూ.31,81,899 విలువగల ఎరువులకు అమ్మకాల తాత్కాలిక నిలుపుదలలో భాగంగా స్టాఫ్ సేల్స్ జారీ చేశారు. ఎంఆర్‌పి ధరలకే యూరియా అమ్మాలని, ఎవరికీ కూడా లింకులు ద్వారా ఇతర ఎరువులను కొనేటట్లు ఒత్తిడి చేయరాదన్నారు. అనుమతులు పొందిన పురుగుమందులను విత్తనాలను మాత్రమే అమ్మకాలు జరపాలని, ఒకవేళ అనుమతులు లేని ఎరువుల విత్తనాలు పరుగులు అమ్మకాలు జరిగితే వారిపై కేసులు పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువుల విత్తనాలకు పురుగుమందుకు తగిన రసీదు తీసుకోవాలని సూచించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

బైపాస్ రోడ్డు భూనిర్వాసితుల వివరాల సేకరణ

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం సమీపంలో వస్తున్న జాతీయ రహదారి బైపాస్ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితుల వివరాలను అధికారులు సేకరించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూనిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రమాదేవి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్లు పొంది కోల్పోయిన, భూములు కోల్పోయిన వారి రికార్డుల ప్రకారం పరిశీలించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వెంచర్‌లో రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం ఒక ధర కేటాయింపు ఉంటుందని, లేని వాటికి మరో ధర కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఎకరాకు రూ.25 లక్షలు వస్తుందని భూ నిర్వాసితులకు తెలుపగా ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారు గగ్గోలు పెడుతున్నారు. మొత్తం 67 మంది ఉండగా అందులో 10 మంది మాత్రమే భూ నిర్వాసితులు ఉన్నట్లు మండల సర్వేయర్ అశోక్ తెలిపారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు, విఆర్‌ఒ భీమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

నదీతీరంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలి

- సిఐ రామాంజులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తులు తుంగభద్ర నదీతీరంలో అప్రమత్తంగా ఉండాలని సిఐ రామాంజులు సూచించారు. శనివారం కర్ణాటకకు చెందిన ముగ్గురు విద్యార్థులు నదిలో స్నానానికి వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం స్థానిక తుంగభద్ర నదీతీరంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది భక్తులు తుంగభద్ర నదిలోకి వెళ్లకుండా భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీమఠం యాజమాన్యం వారు నది ఒడ్డున బారికేడ్లు ఏర్పాటు చేశారని, దాటి వెళ్లకూడదని తెలిపారు. శ్రీమఠం వారు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఏర్పాటు చేసిన షవర్ల ద్వారా మాత్రమే స్నానాలు చేయాలని, నదిలోకి వెళ్లరాదని హెచ్చరించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

- వ్యవసాయ అధికారి ఉషారాణి

ప్రజాశక్తి - దేవనకొండ

సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందుతారని మండల వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్లకొండ, చెల్లెలచలిమల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ లో వేసిన పంటలకు పంటల బీమా ప్రీమియంను సిఎస్‌సి సెంటర్లలో కట్టుకోవాలని తెలియజేశారు. వేరుశెనగ ఊడలు దిగే సమయంలో జిప్సం ఎకరాకు 200 కేజీలు వేసుకోవాలని సూచించారు. పత్తి పంట 20 రోజులప్పుడు వేప నూనె ఎకరాకు ఒక లీటర్ స్ప్రే చేయాలని దీనివల్ల ఆకుల కింద భాగం గుడ్లు పగిలిపోయి పురుగు అబివృద్ధి చెందదని తెలిపారు. ఎఇఒలు రంగన్న, మల్లికార్జున, అబ్దుల్ సలాం, ఎంపిఇఒలు రంగన్న, జ్యోతి, వినయ్, విహెచ్ఎ జీవన్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఉషారాణి

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి- ఆలూరు

ఆలూరులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం పలు కాలనీల నుంచి వచ్చిన ప్రజలతో కలిసి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మైనా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరులోని సిద్ధేశ్వర కాలనీ, బంగ్లా వెనుక కొట్టాల, ఇందిరా నగర్, గాంధీ నగర్ ఇంకా అనేక కాలనీల్లో 15 రోజులకోసారి తాగునీరు వస్తోందని తెలిపారు. తాగునీటి కోసం ధర్నా చేస్తే ఆలూరు పంచాయతీ కార్యదర్శి.. 'బాపురం రిజర్వాయర్‌లో నీరు లేవు.. మేమేం చేయలేం' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. పేదలు ఫిల్టర్ వాటర్ కొని తాగుతున్నారని, నీటి సమస్యను పరిష్కరించడంలో ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. సిద్ధేశ్వర కాలనీలో 200 కుటుంబాలు కొట్టాలు వేసుకుని జీవనం సాగిస్తున్నాయని, వారందరికీ కలిపి ఒక మినీ ట్యాంకు ఏర్పాటు చేశారని చెప్పారు. నీరు సరిపోవడం లేదని మేజర్ పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆలూరులో వీధిలైట్లు వేయకపోవడంతో కటక చీకట్లో మగ్గుతున్నారని చెప్పారు. ఎంపిడిఒ స్పందించి ఆలూరు మేజర్ పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వీధిలైట్లు వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇఒఆర్‌డికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు గోవర్ధన్, విఠల్, షేకున్ బీ, రాధమ్మ, పరమేష్ రెడ్డి, నాగరాజు, వీరేష్, గోపాల్, ఈరన్న, గౌసియా పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్సీ బీటీ.నాయుడు

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, ఆర్‌టిసి ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. మండల కన్వీనర్ పరమారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివీద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు మధు, వెంకటేష్ చౌదరి, వెంకటేష్, నెట్టప్ప పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని తుంబిగనూరు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జ్ ఎన్.రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు. ఇచ్చిన హామీల్లో మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఓర్వలేని వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మండల అధ్యక్షులు జ్ఞానేష్, సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు చింతలగేని నర్సరెడ్డి అధ్యక్షత వహించారు. టిడిపి నాయకులు వక్రాణి వెంకటేశ్వర్లు, హోళగుంద కోసిగయ్య, తాయన్న, గౌస్, నూరి, గోపాల్, భీమయ్య, హనుమేష్, రామకృష్ణ, కోసిగయ్య, సాతనూరు వెంకటేష్, నజీర్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని ఫరిస్సా మొహల్ వీధిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై రూపొందించిన కరపత్రాలు అందజేశారు. అంతకుముందు ఫరీస్సా మొహల్ కాలనీ వార్డు నాయకులు కలందర్ దాదా, షేక్షావలీ, షాషావలీ వారికి ఘన స్వాగతం పలికారు. సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఫక్రుద్దీన్, వేణుగోపాల్ రెడ్డి, గడ్డ ఫక్రుద్దీన్, బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, ఇస్వి శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, నాగరాజు, శీన, మద్దికెర రామకృష్ణ, నారాయణపురం షాషావలీ, ఎమ్.డి.హుస్సేన్, మదిరే మాజీ సర్పంచి గోవిందు, తిక్కన్న, రమేష్, నాగరాజు, టిడిపి సోషల్ మీడియా కార్యకర్త మదిరే శ్రీనివాసులు ఉన్నారు. **చిప్పగిరి** మండలం నేమకల్లు గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై అవగాహన కల్పించారు. **హోళగుంద**లోని బీసీ కాలనీ, బుడగ జంగాల కాలనీ, బుడబుక్కల కాలనీల్లో తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి, టిడిపి సీనియర్ నాయకులు చిన్నహ్యాట శేషగిరి, మండల మాజీ కన్వీనర్ కోనేరు దుర్గయ్య, టిడిపి పట్టణ కన్వీనర్ కె.మల్లికార్జున ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు.



ఆస్పరిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ బీటీ.నాయుడు



ఆదోనిలో...



కోసిగిలో...



హోళగుందలో...



చిప్పగిరిలో

సమయపాలన పాటించని

అధికారులపై చర్యలు తీసుకోవాలి


ప్రజాశక్తి-ఆదోని రూరల్

మండలంలోని బల్లెకల్లు గ్రామంలో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని డివైఎఫ్ఐ మండల కన్వీనర్ వీరేష్ తెలిపారు. మంగళవారం సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ... ఐదు నెలల నుంచి బల్లెకల్లు గ్రామంలో డ్రైనేజీ క్లీన్ చేయక పోవడం వల్ల ప్రజలకు అనేకమైన రోగాలు వచ్చి గ్రామంలో చాలామంది ఇబ్బంది పడుతూ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని, ఆ రోగాల నుండి మమ్మల్ని రక్షించి గ్రామాన్ని శుభ్రం చేయమని అడగడానికి వెళ్లిన డివైఎఫ్ఐ నాయకులకు, ప్రజలకు సిబ్బంది ఎవరు లేక అక్కడ తాళం వేసిన సచివాలయం దర్శనమిచ్చింది. సమయపాలన పాటించకుండా విధులను నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ మండల నాయకులు చిరంజీవి హుసేని రమేష్ పాల్గొన్నారు.

బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి- గోనెగండ్ల

గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని బిఎల్ఒలకు ఓటర్ల జాబితాలో తప్పులు, చేర్పులు, మార్పులు, తొలగింపులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దార్ రాజేశ్వరి హాజరయి మాట్లాడారు. ఎన్నికల కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 204 నుంచి 240 వరకు గల పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల చట్టాలు, ఫారం 6, 7, 8, ఓటరు క్లెయిమ్స్, బిఎల్ఒల విధుల గురించి వివరించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. డిటి రఘువీరా, ఎన్నికల ఉప తహశీల్దార్ వలీబాష, ట్రైనర్ కరుణాకర్ పాల్గొన్నారు.



చెన్నబసప్పను సన్మానిస్తున్న కమిటీ

ఆలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం ఆలయ నిర్వాహకులు లింగారెడ్డి, జనార్ధన్ రెడ్డిలకు రూ.లక్ష నగదు అందజేశారు. ఈ సందర్భంగా చెన్న బసప్ప మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఆలయం కమిటీ వారు చెన్న బసప్పను శాలువా, పూలమాలలతో సన్మానించారు. జట్లయ్య, భీమయ్య, సోమన్న, రఘురామ్, రాజబాబు పాల్గొన్నారు.

సింగిల్ విండో ఛైర్మన్‌గా రామాంజనేయులు

ప్రజాశక్తి - గోనెగండ్ల



గోనెగండ్ల వ్యవసాయ సహకార సొసైటీ సింగిల్ విండో ఛైర్మన్‌గా ఎన్‌వి రామాంజనేయులు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారుల నుంచి సమాచారం అందినట్లు గోనెగండ్ల పిఎసిఎస్ సీఈవో జి చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పిఎసిఎస్ లకు ఒక ఛైర్ పర్సన్ ఇద్దరు సభ్యులతో కలిపి త్రీమెన్ కమిటీలను స్థానిక ఎమ్మెల్యేల ద్వారా నామినేట్ చేసి నియమిస్తుంది. గోనెగండ్ల గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకుడు ఎన్‌వి రామాంజనేయులును ఛైర్ పర్సన్‌గా, గోనెగండ్ల కడపల రమేష్, కులుమాల గ్రామానికి చెందిన కురువ వెంకటేష్‌లను డైరెక్టర్లుగా నియమించింది. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే వీరు బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో గతంలో తనకు ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన తనను గోనెగండ్ల సింగిల్ విండో ఛైర్మన్ గా నియమించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బివి నాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎన్‌వి రామాంజనేయులు తెలిపారు.

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్ణాటక రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగా రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు జ్ఞాపికను అందజేశారు.

సర్పంచి విరుపాక్షి రెడ్డికి సతీ వియోగం

- పలువురి పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం ముగితి వైసిపి సర్పంచి విరూపాక్షి రెడ్డి భార్య గొల్ల ఆనందమ్మ మంగళవారం మృతి చెందారు. ఆమె గత మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సోమవారం కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా మంగళవారం ఉదయం మరణించినట్లు చెప్పారు. భార్య మరణంతో విరుపాక్షి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ,రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్, మంత్రాలయం వైసీపీ నాయకులు ప్రదీప్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆనందమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నందవరం వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, కనకవీడు లక్ష్మి కాంత్ రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సొంత నిధులతో గరుసు రోడ్డు

ప్రజాశక్తి-ఆదోని రూరల్

పదిరోజుల క్రితం వర్షాలు వచ్చినప్పుడు రోడ్లపైన విపరీతమైన నీరు ప్రవహిస్తూ ప్రజలు నడవడానికి కూడా వీలులేకుండా ఉన్న పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన కౌన్సిలర్ వెల్లాల లలితా మధుసూధనశర్మ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం స్థానిక న్యూ అమరావతి నగరలో సొంత నిధులతో గరుసు వేయించి రోడ్లపైన నీరు రాకుండా చర్యలు తీసుకుని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. సొంత నిధులతో గరుసు తోలించి దగ్గర ఉండి పనులు చేయించి నందుకు కౌన్సిలర్ లలిత మధుసూనశర్మ కాలనీ ప్రజలు అభినందించారు.



గరుసు వేయిస్తున్న వెల్లాల మధుసూదన శర్మ